# విజయనగరంజిల్లా రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) నాయకుల అక్రమ అరెస్టులను ఖండించండి!

**విజయనగరంజిల్లా** – పార్వతీపురం మండలం, బడిదేవరకొండలో ప్రభుత్వం గ్రానైట్ త్రవ్వకాలకు 20 సం॥ల కాలం లీజు మంజూరు చేసిన 35 ఎకరాలలో, అనుమతిపొందిన ఎంఎస్‌పి కంపెనీ భూమిపూజ నిర్వహించ తలపెట్టి, తవ్వకాలకు సన్నాహాలు వేగిరం చేసింది. బడిదేవరకొండ తవ్వకాల లీజుకు ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ 'బడిదేవరకొండ పరిరక్షణ పోరాట కమిటి' ఆధ్వర్యంలో గతకొంత కాలంగా ప్రచార ఆందోళనా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాలకు కోరి – గంగాపురం గ్రామపంచాయితీల తీర్మానంలేదు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరపాల్సిన ప్రజాభిప్రాయసేకరణ సభను కూడా జరపకుండానే రెవిన్యూ యంత్రాంగం ఎంఎస్‌పి కంపెనీకి అనుమతులు మంజూరు చేసింది. ములగ, సంగంవలస, కవిటిభద్ర, కోరి–గంగాపురం, యంఆర్.నగరం, చినబొండపల్లి, వెంకంపేట తదితర ఏడు పంచాయితీల ప్రజలు బడిదేవరకొండను ఆదికాలం నుండి దేవతగా భావించి ఆరాధిస్తున్నారు. బడిదేవరకొండ పరిరక్షణ కమిటి సభ్యులు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కలిసి 30–9–16న బడిదేవరకొండ ప్రాంతాన్ని పరిశీలించి ప్రకృతితో ముడిపడిన ఆదివాసీ ప్రజల ఆచార సాంప్రదాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని, కొండ తవ్వకాల అనుమతులు రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

బడిదేవరకొండ నుంచి వచ్చే జీవగడ్డ ఊటజలాలు రైతాంగానికి సాగునీటికి ఉపయోగపడుతున్నాయి. ఈ నీటితో పరిసరాల్లోని సుమారు 40 గ్రామాల చెరువులు నిండి సాగునీటికి ఉపయోగపడుతున్నాయి. కొండపై ఆధారపడి గిరిజనులు విస్తృతంగా పోడు పంటలు పండించుకొని జీవిస్తున్నారు. ఈ కొండపై నుండి వచ్చే జీవగెడ్డలపై మినీ రిజర్వాయర్ నిర్మిస్తే, సాగునీరు మరింత పుష్కలంగా అందుబాటులోకొస్తుంది.

16–10–16న బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాలకు సన్నాహకంగా భూమిపూజ నిర్వహించే ఎంఎస్‌పి కంపెనీ యజమానులకు వత్తాసుగా ప్రభుత్వ, పోలీసు యంత్రాంగం మోహరించి, పోరాట కమిటి నాయకులు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) విజయనగరంజిల్లా నాయకులు కామ్రేడ్స్ శ్రీనునాయుడు, బి. శంకరరావు, బాషాలను ముందస్తుగా అరెస్టు చేయటాన్ని రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) తీవ్రంగా ఖండిస్తోంది. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తోంది.

పర్యావరణానికి, భూగర్భజలాలకి, రైతాంగ సాగునీటికి హానికరమైన; కొండపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజన ప్రయోజనాలకు విరుద్ధమైన బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం మంజూరుచేసిన లీజును వెంటనే రద్దుచేయాలని, కొండ తవ్వకాల సన్నాహాలను ఎంఎస్‌పి కంపెనీ వెంటనే నిలిపివేయాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) డిమాండ్ చేస్తున్నది.

**16–10–16**
**విజయవాడ**

**యస్.ఝాన్సి**
**అధ్యక్షులు,**
**రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)**